# పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి సమాజానికి ఆదర్శం

### ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పండగ సాయన్న పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తి దాయకమని జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ కొనియాడారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల జానపద చరిత్రలో పేదల పక్షాన నిలిచి, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజావీరుడిగా పండుగ సాయన్న ప్రత్యేక గుర్తింపు పొందారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పేదలకు అండగా నిలవడం, బలహీన వర్గాల ఆత్మ గౌరవం కోసం పోరాడటం ఆయన జీవితంలో ప్రధానమైన విలువలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐలు కాశీరాం, పూర్ణచందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 23 అక్టోబరు, 2026 | పేజీలు : 08


# ఘనంగా ప్రజాపక్షం వార్షికోత్సవం

### హాజరైన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ:** 'ప్రజాపక్షం' దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని హనుమకొండలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ బాల సముద్రంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపక్షం పత్రిక ప్రజాస్వామ్య వాదుల గొంతుకగా నిలిచిందని, సమాజంలో వామపక్ష, లౌకిక,ప్రజాతంత శక్తుల కరదీపికగా ముందుకు సాగుతున్నదని అన్నారు.ప్రజాసమస్యలే ఎజెండాగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా వార్తలను అందిస్తూ ముందడుగు వేస్తున్న దినపత్రిక ప్రజాపక్షం అన్నారు. సమాజంలోని పేద, కార్మిక, రైతు, మహిళల, విద్యార్థి యువజన,ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్నదని అన్నారు. ఎటువంటి పక్షపాతం లేకుండా ప్రజాహితమే పరమావధిగా వార్తలను నిజాయితీతో వార్తలను ప్రచురించడంలో ప్రజాపక్షం ప్రజాపక్షం దినపత్రిక ముందుకు సాగాలన్నారు. దిన దినాభివృద్ధి చెంది మరింతగా ప్రజల మన్ననలు చూరగొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ప్రజాపక్షం జిల్లా ప్రతినిధి తోట సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు ఏదునూరి వెంకట్రాజం, ఎన్ఏ స్టాలిన్, మాలోతు శంకర్,నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, గుంటి రాజేందర్, ప్రజాపక్షం విలేఖరులు ఎండి. ఉస్మాన్ పాషా,ముదిగిరి ఓదెలు, పి. కిషోర్, కుక్కల రాజు,ఎర్ర కుమారస్వామి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు వెలుగులోకి తెస్తున్న పత్రిక



### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న ప్రజాపక్షం దినపత్రిక ఎనిమిదేళ్లు పూర్తి చేసుకోవడం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఏఐటీయూసీ కొమరయ్య భవన్లో ప్రజాపక్షం దినపత్రిక ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాపక్షం తనదైన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఇబ్బందులు, కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల పక్షాన నిలవడం పత్రిక ప్రత్యేకత అని కొనియాడారు. ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, సంపాదకవర్గానికి, పాత్రికేయులకు, పాఠకులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చెరుకు సుధాకర్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జి సుధాకర్ రెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, చంద్రమౌళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, నాయకులు గోలి లావణ్య, యాకూబ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షంగా ఉండడమే 'ప్రజపక్షం' లక్ష్యం

**ప్రజాపక్షం/జనగామ:** ప్రజల పక్షంగా ఉండడమే ప్రజాపక్షం దినపత్రిక ప్రధాన లక్ష్యమని జనగామ మాజీ ఎమ్మెల్యే, నవ చేతన విజ్ఞాన సమితి సభ్యుల, సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవ వేడుకలు గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో గురువారం ఘనంగా జరిగాయి. సిహెచ్ రాజారెడ్డి, టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఇర్రి మల్లారెడ్డి, కార్యదర్శి సురిగెల బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పార్నంది వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి పార్నంది వెంకటస్వామి అధ్యక్షత వహించగా సిహెచ్ రాజారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ విషయాలు ఎప్పటికి అప్పుడు తెలియజేడంతో ప్రజాపక్షం ముందజంలో ఉందన్నారు. అనేక పత్రికలు ఉన్నప్పటికి ప్రజాపక్షం మాత్రం నిత్యం ప్రజల పక్షాణ నిలస్తుందని, ప్రజలకు అండగా ఉంటు, ప్రజా సమస్యలే పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. తాను 1980 నుండి జర్నలిస్టులనే అని ప్రజా సమస్యలు తనకు తెలుసునన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తిగా ఇటీవల ప్రజా సమస్యలపై అనేక కథనాలు, వ్యాసాలు రాయడం జరుగుతుందన్నారు. కమ్యూనిస్టు భావలజాలంలో విశాలాంధ్ర పత్రికను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మన తెలంగాణ పత్రికను ఏర్పాడు చేయడం జరిగిందన్నారు. తరువాత వచ్చిన మార్పుల నేపథ్యంలో ప్రజల పక్షాల ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రజాపక్షం పత్రికను తీసుకురావడం జరిగిందన్నారు. లాభాపేక్ష కాకుండా ప్రజల సమస్యల వేదికగా ప్రజాపక్షం నడుస్తుందన్నారు. ప్రజాపక్షం పత్రికకు తమ వంతు సహకారం ఎప్పటికి ఉంటుందన్నారు. టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఇర్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల్ని నిలదీసే ఏకైక పత్రిక ప్రజాపక్షం అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు ప్రజా సమస్యల్ని వెలికితీయడంతో ప్రజాపక్షం ముందుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు కొన్ని పత్రికలు వారధిగా ఉంటే ప్రజాపక్షం మాత్రం ప్రజలకు దారి చేపూ పత్రికగా, ప్రభుత్వానికి సూచనలు ఇచ్చే పత్రికగా ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య ప్రజాపక్షం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి సురిగెల బిక్షపతి, ప్రజాపక్షం విలేకర్లు ఎంఎ రహమాన్, ఇమ్మడి భాస్కర్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, కాంసాని మహిపాల్‌రెడ్డి, కుర్రెమలు శ్రీనివాస్, నర్రా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గిరిజనుల హక్కుల పోరాట యోధుడు భీం



ప్రజాపక్షం/గూడూరు/మహబూబాబాద్; మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టేవాడ గ్రామంలో ఆదివాసీల ఆరాధ్యదైవం జల్ జంగల్ జమీన్ పోరాట యోధుడు కొమురం భీమ్ 125 వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆదివాసీ టాచర్స్ అసోసియేషన్ గూడూరు మండల అధ్యక్షుడు ముయ్యబోయిన వెంకన్న మాట్లాడుతూ కొమురం భీమ్ 1901 వ సంవత్సరంలో ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ తాలూకాలోని ఓ గోండు గిరిజన కుటుంబంలో జన్మించారని గుర్తుచువారు. జల్ జంగిల్ జమిన్ నీరు అడవి భూమి పై గిజనులకు సర్వహక్కులు ఉండాలని వారు పోరాడారు.ఈకార్యక్రమంలో గ్రామ దొర బిజ్జా. పోట్టయ్య పట్టల్ రేగ వెంకటేశ్వర్లు ఆగబోయిన సమ్మయ్య రేగ పాపారావు పాల్గొన్నారు.

## భూమి సాగు సంరక్షణ పై రైతులకు అవగాహన

ప్రజాపక్షం/కమలాపూర్: కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి, వ్యవసాయ శాఖ సంయుక్తంగా గూడూరు రైతు వేదికలో నిర్వహించిన భూమి సాగు సంరక్షణ కార్యక్రమానికి హాజరైన మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. అనంతరం ఝాన్సీ రాణి మాట్లాడుతూ... పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు తగ్గిన కారణంగా వచ్చే రబీ కాలానికి వరి పంట వేయకుండా, ఆరుతడి పంటలు, కూరగాయాల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రకృతి వైపరీత్యంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన ఎల్‌నినో విపత్తును మనందరం సంయుక్తంగా ఎదుర్కొని, ప్రభుత్వ సలహాలు పాటించి, ప్రభుత్వానికి సహకరించాలని, అనవసరంగా ఎక్కువ నీటి వినియోగం ఉన్న పంటలను వేసి రైతన్నలు నష్టపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. వేణు, మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య, బాలసాని రమేష్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, జనగాని శివకృష్ణ, గట్టు శ్రీధర్, కిన్నెర కృష్ణమూర్తి, ఆకినపల్లి బిక్షపతి, రైతులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్‌లో శానిటేషన్ పనులు పూర్తి చేయాలి

ప్రజాపక్షం/కమలాపూర్: కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో ఇటీవల పేదలకు పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మిగిలి ఉన్న శానిటేషన్, ఎలక్ట్రిసిటి పనులను వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి పర్యవేక్షించి, త్వరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అతి తొందరలో స్వాధీనం చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాక చంద్రమౌళి, భాషబోయిన రమేష్, డైరెక్టర్లు గట్టు శ్రీధర్, జనగాని శివకృష్ణ, ఆకినపల్లి బిక్షపతి, మిల్కూరు శ్రీనివాస్, కిన్నెర కృష్ణమూర్తి, నిగ్గుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌సిడిసి సర్వేను ప్రారంభించిన డాక్టర్ అప్పయ్య



ప్రజాపక్షం/ఆత్మకూరు : కుష్టు వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమిష్టిగా కృషి చేయాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఏ. అప్పయ్య విజ్ఞప్తి చేశారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో చేపట్టిన లెప్రసీ కేసుల గుర్తింపు ప్రచార కార్యక్రమం (ఎల్ సీడీసీ) సర్వేను గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య ప్రారంభించి మాట్లాడుతూ, కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి వల్ల కలిగే వైకల్యాలను నివారించడంతోపాటు వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించాలని, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి వైద్య పరీక్షల నిమిత్తం సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సూచించారు.కుష్టు వ్యాధి సోకిన వారిలో సాధారణ చర్మపు రంగు కంటే తక్కువ రంగు లేదా రాగి రంగులో మచ్చలు కనిపించవచ్చని, ఆ మచ్చలపై స్పర్శ జ్ఞానం తగ్గడం లేదా లేకపోవడం ప్రధాన లక్షణమని వివరించారు. వ్యాధి నరాలను ప్రభావితం చేసినప్పుడు చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, బలహీనత, స్పర్శ జ్ఞానం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్పందన, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఎంఓలు రవీందర్, ఎల్లయ్య, దేవ్ సింగ్, సీహెచ్ఓ జునేధి, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరంగల్ నగర భవిష్యత్తు అభివృద్ధి కోసమే రోడ్ల విస్తరణ



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వరంగల్ నగర భవిష్యత్తు అభివృద్ధి, ప్రజల సౌకర్యాలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ బస్టాండ్ నుంచి జేఎన్ఎస్ స్టేడియం మీదుగా డీసీసీ భవన్ వరకు సుమారు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యతో రోడ్లపై ట్రాఫిక్ తీవ్రంగా పెరుగుతోందని, అనేక ప్రాంతాల్లో బంపర్ టు బంపర్ ట్రాఫిక్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాతకాలం నాటి రహదారులు ప్రస్తుత జనాభా, వాహనాల అవసరాలకు సరిపోవడం లేదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నగర అభివృద్ధిని పక్కన పెట్టడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. నేటి నిర్ణయాలు రేపటి తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, మన పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను రాజకీయ కోణంలో చూడకుండా, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అర్థం చేసుకోవాలని సూచించారు.హనుమకొండ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు, స్థానిక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అభివృద్ధి పనులపై రాజకీయాలకు అతీతంగా సహకరిస్తేనే నగరానికి మెరుగైన రహదారులు, సులభమైన రవాణా, మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

## బొల్లికుంట రైతు వేదికలో 'ఖేతీ బచావో అభియాన్'



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని బొల్లికుంట రైతు వేదికలో ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమాన్ని రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ (ఏపిసి) సురేంద్ర మోహన్ ఐఏఎస్, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి ఐఏఎస్ ఈ వీసీని నిర్వహించగా, బొల్లికుంట రైతు వేదికలో సుమారు 100 మంది రైతులు పాల్గొని వీక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఎనుమాముల చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఆత్మ పీడీ విజయ నిర్మల, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక అధికారి, కేవీకే శాస్త్రవేత్త అరుణ జ్యోతి, ఖిలా వరంగల్ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కె. జనార్ధన్, వైస్ చైర్మన్ భూమాత, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) బొల్లికుంట మనస్విని తదితరులు పాల్గొన్నారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించి, భూమిని కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పండుగ సాయన్న, కొమరం భీమ్ జయంతి ఉత్సవాలు



ప్రజాపక్షం/భీమదేవరపల్లి : భీమదేవరపల్లి మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్ నాయకత్వంలో ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో వీర యోధులు పండుగ సాయన్న, కొమరం భీమ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలోని అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం వారు చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. వారి పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జక్కుల అనిల్ యాదవ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉషాకోయిల ప్రకాష్, బొజ్జపురి అశోక్ ముఖర్జీ, ఆదరి రవీందర్, పొన్నాల మురళి, డబ్బా శంకర్, శ్రీరామోజు సమ్మయ్య, మాడుగుల గోపి, కాసగోని బాలకృష్ణ, తల్లా సదానందం, వెంకన్న, మాడుగుల కొమురయ్య, ఎల్ది వినోద్, రాకేష్,అజయ్,రెనా ప్రవీణ్ పాల్గొన్నారు.

## నేడు ప్రణవ్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/కమలాపూర్: కమలాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు నేడు హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు చేతుల మీదుగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమానికి లబ్ధిదారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్ విజ్ఞప్తి చేశారు.

## అలైబలైలో నిహారికకు సన్మానం

ప్రజాపక్షం/జనగామ టౌన్: హైదరాబాద్‌లో నిర్వహించిన అలై బలై కార్యక్రమంలో నెట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన తాటి నిహారికను హిమాచల్ ప్రదేశ్, హర్యానా మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ సన్మానించి అభినందించారు. అలైబలై చైర్మన్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి సైతం నిహారికను అభినందించారు. బండారు దత్తాత్రేయ ఆహ్వానం మేరకు మాల మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జి తాటి కుమార్ తన కుమారుడు తాటి యశ్వంత్ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండారు దత్తాత్రేయ కుటుంబం తనను స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించడం ఇది మూడోసారి అని కుమార్ తెలిపారు. తన కుమార్తెను ప్రోత్సహించిన బండారు దత్తాత్రేయ, విజయలక్ష్మి కి, కార్యక్రమానికి ఆహ్వానించిన కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆదర్శప్రాయుడు పండుగ సాయన్న

ప్రజాపక్షం/భూపాలపల్లి: తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రసిద్ధి చెందిన పండుగ సాయన్న జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగ సాయన్న బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న దోపిడీని, భూస్వాముల పెత్తనాన్ని ఎదిరిస్తూ పేద ప్రజల పక్షాన నిలిచిన పోరాట యోధుడని కొనియాడారు. సమాజంలో నెలకొన్న అన్యాయాలు, అసమానతలను ప్రశ్నిస్తూ పేదల ఆకలి తీర్చడం, నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ సమీపంలోని నవాబుపేట మండలం మెరుగోనిపల్లెకు చెందిన పండుగ సాయన్న తన జీవితంలో ఎన్నో కష్టాలు, అన్యాయాలను ఎదుర్కొని ప్రజల హక్కుల కోసం పోరాటం సాగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి చిర్రా రఘు, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఆకుల సుభాష్, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు జోరుక సదయ్య, శ్రీనివాస్, సుధాకర్, రవీందర్, గోపాల్, శ్రీధర్, మల్లయ్య, మద్దెల విజయ, బీమనాథుని సత్యనారాయణ, జిల్లాలోని వివిధ బీసీ సంఘా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడుకోవాలి



ప్రజాపక్షం/నర్సంపేట: ఎల్‌నినో ప్రభావంతో రోజు రోజుకు భూగర్భజలాలు అడుగంటకుపోయే ప్రమాదం ఉందని, రైతులు, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ రైతువేదికలో మంత్రి వీడియోకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌కు నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కమిటి సభ్యులు ప్రభాకర్, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి, ఏఓ కృష్ణకుమార్లు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ రంగానికి ఎలినో ప్రభావం, పంట దిగుబడుల గురించి, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు కొనుగోలుపై సంబంధించిన అంశాలపై రాష్ట్ర మంత్రివర్యులు వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులు, రైతులు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా పండుగ సాయన్న జయంతి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, రాష్ట్ర మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం, ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి అశోక్, ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న ధైర్య సాహసాలు, చేసిన సేవలను అధికారులు ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, ఇతర అధికారులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సుస్థిర పంటలు పండించాలి

## మండల వ్యవసాయ అధికారి నెలవంక

**ప్రజాపక్షం/ అల్లాదుర్గం:** మండల కేంద్రంలో గల రైతు వేదిక కార్యాలయంలో గురువారం వ్యవసాయ అధికారి నెలవంక ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పంట అవశేషాల నిర్వహణ, పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ మరియు సుస్థిర వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రాంతానికి అనుకూలమైన పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ ఖర్చులను తగ్గించి, లాభదాయకమైన సాగు పద్ధతులను అవలంబించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్ కుమార్, ఆత్మ కమిటీ సిబ్బంది కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సారయ్య మృతి పట్ల ఎమ్మెల్యే సంతాపం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మాజీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త, సీనియర్ జడ్పీటీసీ సభ్యులు సారయ్య మృతి చెందడం పట్ల వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సారయ్య మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సారయ్య మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ సారయ్య మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ఇది తీరని లోటని పేర్కొన్నా రు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. సారయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా సారయ్య కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, 14 వ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్, డివిజన్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి సాగు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

## ఎల్‌నినో ముప్పు.. పడిపోనున్న ప్రాజెక్టులు చెరువుల నీటి నిల్వలు

## రైతులు ఆగం కావద్దు.. అధికారుల సూచనలు పాటించండి

## నీటి పారుదల శాఖ డిఇఇ చింతాడ కిరణ్

**ప్రజాపక్షం/గూడూరుః** రానున్న యాసంగి(రబీ) సిజన్‌లో వాతావరణ పరిస్థితులు సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని అన్నదాతలు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి నాట్లు వేయవద్దని గూడూరు నీటిపారుదల ఉపవిభాగం నం.2 ఉప కార్యనిర్వహక ఇంజనీరు చింతాడ కిరణ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం గూడూరు మండలంలోని రైతాంగాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం గణనీయంగా పడిపోయే అవకాశాలు ఉన్నాయని అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.ఈ వాతావరణ మార్పుల కారణంగా ప్రధాన ప్రాజెక్టులు చెరువులు కుంటల్లో నీటి నిల్వలు ఊహించిన దానికంటే వేగంగా అడుగంటే ప్రమాదం ఉందని అంతేకాకుండా భూగర్భజలాలు కూడా పాతాళానికి పడిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులు నీటి లభ్యతను ముందుస్తుగా సరిగ్గా అంచనా వేసుకోకుండా ఉత్సాహంతో వరి సాగు చేపడితే చివరి దశలో పంటకు నీరందక చేతికొచ్చిన పైరు ఎండిపోయి పెట్టుబడులు కో ల్పోయి తీవ్ర ఆర్థిక నష్టాల్లో కురుకుపోయే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు. రైతుల కష్టం బుగ్గిపాలు కాకూడదనే ఉద్దేశంతోనే ఈ హెచ్చరికలు జారీ చేస్తున్నామని తెలిపారు. కాబట్టి ఇయకట్టు పరిధిలోని రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు సూచనలు త ప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. తక్కువ నీటితో త క్కువ పెట్టుబడితో చేతికందే ఆరుతడి పంటలైన పుప్పుదినుసులు నూనేగింజలు చిరుధాన్యాలు కూరగాయలు వంటి లాభసాటి ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొ గ్గు చూపాలని సూచించారు. విపత్కర వాతావరణ పరిస్థితులను గ్రహించి వ్యవసాయ నీటిపారుదల శాఖలు ఇచ్చే శాస్త్రీయ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పా టించి రైతు కుంటుంబాలు తీవ్ర నష్టాల బారిన పడకుం డా జాగ్రత్త పడాలని చింతాడ కిరణ్ రైతు సోదరులను కోరారు.

# గూడూరులో ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/గూడూరుః** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గురువారం ఆదివాసీ ఉద్యోగులు ఉపాధ్యాయులు యువకులు ఆధ్వర్యంలో ఆదివాసీ పోరాట యోధుడు గోండు బొబ్బిలి కొమురం భీమ్ 125 వ జయంతి వేడకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.స్థానిక కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 1901 అక్టోబర్ 22 న జన్మించిన కొమురం భీమ్ జల్ జింగిల్ జమీన్ నినాదంతో గిరిజనుల హక్కుల కోసం నిజాం నిరంకుశ పాలనపై తుదిశ్వాస వరకు వీరొచితంగా పోరాడారని కొనియాడారు. ఆదివాసీల ఆత్మగౌరవం హక్కుల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు కొమురం భీమ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్పూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగులు అయిలబోయిన వీరయ్య, బత్తుల శ్రీనువాస్, వెంకన్న, పడిగే రమేష్, రేగ రమేష్, సత్యం, రేగ సాంబయ్య, లింగాల లక్ష్మి నారాయణ, తుడుందెబ్బ నాయకులు అర్రేం వీరస్వామి, దారం మహేందర్, చంద్రయ్య దొరలతో పాటు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌పిని కలిసిన టిజెఎ నూతన కమిటీ

**ప్రజాపక్షం/ములుగుః** తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్(టిజేఏ) ములుగు జిల్లా నూతన కమిటీ సభ్యులు గురువారం జిల్లా ఎస్‌పి కేకాన్ సుధీర్ రామ్‌నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి కమిటీ సభ్యులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలు, మీడియా భద్రత, సమాచార లభ్యత తదితర అంశాలపై వారితో చర్చించారు. సమాజంలో వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఎస్‌పి పేర్కొన్నారు. చట్ట పరిధిలో విధులు నిర్వర్తించే జర్నలిస్టుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జర్నలిస్టులకు ఏదైనా సమస్య ఎదురైతే



తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీజేఏ నూతన కమిటీ సభ్యులు ఎస్‌పికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌పిని కలిసిన వారిలో టిజేఏ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి సంగ రంజిత్ కుమార్, సభ్యులు బిక్షపతి, తదితరులు ఉన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్



**ప్రజాపక్షం/చిట్యాలః** ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ధైర్యశాలి కొమురం భీం అని అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత, ఏవైఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో కొమురం భీం జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలామలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పుల్ల మల్లయ్య, జన్నె యుగేందర్, కొలిపాక సాంబయ్యలు మాట్లాడుతూ ఆదివాసీలకు నీరు, అడవి, భూమిపై హక్కులు కల్పించాలనే లక్ష్యంతో కొమురం భీం నాటి నిజాం పాలకులపై వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. జల్..జంగల్..జమీన్ నినాదంతో స్వయం పాలన కోసం పోరాడి అమరుడయ్యాడని పేర్కొన్నారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, మహిళల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. కొమురం భీం ఆశయాలను ఆదివాసీలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రాజేందర్, చిట్యాల మండల సీనియర్ నాయకులు గురుకుంట్ల కిరణ్, గడ్డం సదానందం, రేగొండ మండల నాయకులు కొలిపాక సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక భేటీ



**ప్రజాపక్షం/గూడూరుః** మహబూబాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ గూడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడొత్ సునీత కొమ్మాలు నాయక్ నివాసానికి మర్యాదపూర్వకంగా విచ్చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి సర్పంచ్ కుటుంబ సభ్యులు స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో భాగంగా గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని పలు సమస్యలు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేతో సర్పంచ్ చర్చించారు. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎమ్మెల్యే మురళి నాయక్ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మండల పార్టీ నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి ఎండి రసూల్ సాంబయ్య సోమన్న రాంబాబు తదితరులు పాల్గోన్నారు.

# అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు కావాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లిః** త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సూచించారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదు ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. ఓటు హక్కుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కటకం జనార్ధన్, సెగ్గం సిద్దు, మందల రవీందర్ రెడ్డి, దార పూలమ్మ, మాదాసి తిరుపతమ్మ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుకగా 'ప్రజాపక్షం' నిలవాలి

## టిజిఎస్ రాష్ట కార్యదర్శి రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజ సమస్యలు రాజకీయ సామాజిక అంశాలపై సమగ్ర వార్తా కథనాలను అందిస్తూ పాఠకుల ఆదరణ పొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర పత్రిక యాజమాన్యానికి సంపాదకవర్గానికి పాత్రికేయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలోని వివిధ వర్గాల అభిప్రాయాలను ప్రజలకు చేరవేయడంలో ప్రజాపక్షం దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పత్రిక యాజమాన్యం సంపాదకులు, పాత్రికేయులు, సిబ్బంది అందరికీ 8వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజల పక్షాన మరింత బాధ్యతాయుతమైన జర్నలిజంతో ప్రజాపక్షం దినపత్రిక ముందుకు సాగాలని రాజేష్ ఖన్నా ఆకాంక్షించారు.

# గ్రామాభివృద్ధి, జలవనరుల పరిరక్షణే లక్ష్యం

### సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** గ్రామాభివృద్ధి జలవనరుల పరిరక్షణే లక్ష్యమని సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ అన్నారు.గురువారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో జలవనరుల పరిరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ సంరక్షణ లక్ష్యంగా మండలకేంద్రంలోని అమృత సరోవర్ ట్యాంకుల వద్ద ప్రత్యేక క్యాంపెయినింగ్ 6 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ హసీనా బానో మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.భవిశ్యత్ తరాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడడంలో అమృత సరోవర్ ట్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.జలవనరులను పరిశుభ్రంగా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్యాంకుల పిసర ప్రాతాలను శుభ్రంగా ఉంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు దోమల నివారణకు అవకాశం ఉంటుందని అన్నారు.గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించడంతో పాటు నీటి వనరులను సంరక్షించేందుకు ప్రజలు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. మండలకేంద్రంలో టస్సర్ పట్టు పురుగుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు గ్రామ పంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని సర్పంచ్ హసీనా బానో హామిఇచ్చారు.గురువారం టస్సర్ పట్టు పురుగుల పెంపక కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా పట్టు పురుగుల పెంపకం, వాటి ఎదుగుదల,దిగుబడి వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు.పట్టు పురుగులకు సోకుతున్న వ్యాధులు,కీటకాల ఉధృతి ,పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పట్టు పరిశ్రమను నమ్ముకుని ఉపాధి పొందుతున్న రైతులకు అండగా ఉంటామని అన్నారు. పట్టు పరుగులకు వ్యాధులు సోకకుండా తగిన చర్యలు తీసుకునేందుకు సంబందిత అధికారులతో మాట్లాడి అవసరమైన మందులు, సాంకేతిక సలహాలు అందుబాటులో తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. పట్టు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ఏఈ శ్రీనివాస్, వార్డు సభ్యులు కొడపల్లి రాములు, సమ్మయ్య, మహ్మద్, సిబ్బంది నాయకులు, పట్టు రైతులు పాల్గొన్నారు.

## కెటిఆర్, హరీశ్ రావులను కలిసిన పాలాట సర్పంచ్ సాయికుమార్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రులు కల్వకుంట్ల తారక రామారావు ,తన్నీరు హరీశ్ రావులను పాలాట సర్పంచ్ నీలం సాయి కుమార్ గౌడ్ మనోహరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విజయదశమి పండుగ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ పూల అర్జున్, కుచారం గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాసరి నరేష్ ముదిరాజ్, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట:** మండల పరిధిలోని కొల్లపల్లి గ్రామానికి చెందిన పులబోయిన శంకరమ్మ (72) బుధవారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వంటల విషయంలో కోడలు సావిత్రితో జరిగిన వాగ్వాదంతో మనస్తాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. గురువారం కోడలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుక



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** నిజాం పాలనలో దొరలు,భూస్వాముల అన్యాయాలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి, పేదలు, నిరుపేదల పక్షాన నిలిచిన వీరుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కాసాని వీరేష్ ముదిరాజ్ తో కలిసి మనోహరాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దాసరి నరేష్, పండుగ సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమని కొనియాడారు. పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## 28న సీనియర్ ఎంఆర్‌పిఎస్ సభ

### రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు అల్లారం రత్నయ్య

**ప్రజాపక్షం/పాపన్నపేట:** 28న మెదక్‌లో జరగనున్న సీనియర్ ఎంఆర్‌పిఎస్ జిల్లా సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లారం రత్నయ్య పిలుపునిచ్చారు. గురువారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ, మెదక్ లోని టివిస్పి భవన్ లో ఉదయం 10:30 గంటలకు జరిగే సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ మాదిగ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అసైన్డ్ భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, మాదిగలు, మాదిగ ఉపకులాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచాలని, అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు.

## పిల్లుట్లలో దుర్గామాత శోభాయాత్ర



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని పిల్లుట్ల గ్రామంలో దుర్గాభవాని ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 9రోజులు పూజలు అందుకొని గురువారం దుర్గామాత శోభాయాత్ర వైభవంగా సాగింది. ఒగ్గు కళాకారులు, డప్పుచప్పుళ్ల దరువులు, విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, మహిళల కోలాటాలు, డీజే నృత్యాలు మధ్య కన్నుల పండువగా సాగింది. భక్తులకు జనుముల నెల్లురు జయమ్మ దంపతు పులిహోర ప్రసాదం అందజేశారు. అనంతరం గ్రామ పెద్దచెరువులో నిమజ్జనం చేశారు.

## భూ తగాదాలకు తావులేకుండా పక్కాగా భూ రీ సర్వే

### జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** భూ తగాదాలను పరిష్కరించి,రైతులకు ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా భూ రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో కచ్చితమైన వివరాలను సేకరించి,పారదర్శకంగా భూముల కొలతలు చేపట్టాలని సూచించారు. గురువారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న తీరును, అధికారులు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భూ రీ సర్వే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి తప్పులకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు.రైతుల మధ్య భూ సంబంధిత వివాదాలు తలెత్తకుండా,భూముల హద్దుల విషయంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఇప్పటికే 1,200 ఎకరాల్లో భూ రీ సర్వే నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తి వివరాలతో సర్వే చేపట్టి,భూ రికార్డుల్లో కచ్చితత్వాన్ని పాటించాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే కీలకమని, ఈ ప్రక్రియను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జావయ్య,ఏడీ ల్యాండ్ సర్వే కిషన్,తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ కౌశికి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజు, సర్పంచ్ అనూష, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబరులో జాతీయ స్థాయి క్రీడా సంబరం

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) మరో ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి క్రీడా పోటీలకు వేదిక కానుంది.డిసెంబరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారు.ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది.ఈ క్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం జేఎన్ఎస్ స్టేడియాన్ని సందర్శించి, పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేడియంలోని క్రీడా ప్రాంగణం, క్రీడాకారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ స్థాయి పోటీలకు హనుమకొండ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. వసతి, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్ల తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా యువజన క్రీడల అధికారి కొత్త ప్రశాంత్‌కు ఆదేశించారు. పోటీల సమయంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.స్టేడియంలో కొత్తగా నిర్మిస్తున్న మరుగుదొడ్లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, క్రీడా పోటీలు ప్రారంభమయ్యేలోపు అన్ని ఏర్పాట్లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న ఎస్‌పి

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ అమ్మవారిని జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా బుధవారం నాడు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎస్పీ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## శ్రీగురుపీఠంలో ప్రత్యేక హోమం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని గూడురు గ్రామంలో ఉన్న శ్రీగురుపీఠంలో శ్రీదత్తాత్రేయమహాస్వామి పంచాయతనం గురుపరంపర దేవాలయం, పంచవటి, శ్రీషిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం ఆలయ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగొని శివకుమార్‌గౌడ్ రమాదేవి దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి గణపతి, నవగ్రహ , శ్రీలక్ష్మి నృసింహ, శ్రీధన్వంతరి, శ్రీదత్తాత్రేయ మూలమంత్రం, శ్రీసాయినాథ మూలమంత్రం, శ్రీపంచవటి దేవతలు శ్రీమహావిష్ణువు, శ్రీకృష్ణ, శ్రీమహాలక్ష్మి, శ్రీసాయినాథ హోమాలు ఘనంగా జరిగాయి. ఉదయం అభిషేకం, అర్చన, దివ్య మంగళహారతి అనంతరం 11 గంటలకు దత్తాత్రేయ మహాస్వామి శతనామార్చన, శ్రీగురుస్వామి, సమర్థ సహిత దత్తాత్రేయ స్వామి, దివ్య మంగళ నీరాజనం, మధ్యాహ్న హారతి ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి నటరాజశర్మ, ట్రస్టు సభ్యులు జిన్నారం సూర్యంకుమార్‌గౌడ్, రాజ్యం భిక్షపతియాదవ్, సర్పంచ్ నర్సయ్య, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్, సమన్వయకర్త సత్యనారాయణరావు, భక్తులు పాల్గొన్నారు.

# సాయన్న 174వ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/నర్సాపూర్ : 174 పండగ సాయన్న జయంతి వేడుకలు గురువారం నర్సాపూర్ పట్టణంలో నియోజకవర్గ ఇంచార్జ్,ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇంచార్జ్ ఆవుల రాజు రెడ్డి మాట్లాడుతూ పండగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలు నర్సాపూర్ చౌరస్తాలో నిర్వహించడం ఎంతో సంతోషకరమైన అన్నారు. పండుగ సాయన్న చేసిన సేవలు మరువలేని పండగ సాయన్న బాటలోనే ముదిరాజులంతా నడవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉదయ్ కుమార్, శివకుమార్, హరీష్, సంజీవ్, ఆంజనేయులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి 24 గంటల విద్యుత్‌ను అందించాలి..

-సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్

ప్రజాపక్షం/బెజ్జంకి : రైతాంగానికి 24 గంటల విద్యుత్‌ను అందించాలని సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని ఏడీ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి అనంతరం ఏడీకి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో బోరు బావుల ద్వారానే రైతులు వరి పంటను అధికంగా సాగు చేశారని తెలిపారు.ప్రస్తుతం రైతాంగానికి 8 నుండి 10 గంటలు మాత్రమే విద్యుత్‌ను సరఫరా చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.వరి పంట చివరి దశలో ఉన్నందున నీరు ఎక్కువ అవసరం ఉంటుందని కరెంట్ కోతలతో బోరు బావుల ద్వారా పంటకు నీరు అందించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.అప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి త్రీఫేస్ 24 గంటల విద్యుత్‌ను అందించి ఆదుకోవాలని సిపిఎం పక్షాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బొమ్మిడి సాయికృష్ణ,సంఘ ఎల్లయ్య,బోనగిరి లింగం,కుంట సత్తయ్య,గాజ రాజు,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్ కు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాపక్షం / నిజాంపేట్ : నిజాంపేట మండల కేంద్రంలో నూతన బస్టాండ్ ఆవరణలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి డివైడర్ ఢీకొట్టాడు అతని తలకు తీవ్ర గాయాలతో పడి ఉన్న వ్యక్తిని 108 అంబులెన్స్ సహాయంతో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్కూటీ పై వెళ్తున్న వ్యక్తి నర్సాపూర్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.



# పౌరుషానికి ప్రతిరూపం పండగ సాయన్న

ప్రజాపక్షం/గజ్వేల్ : పేదల ఆరాధ్య దైవం దివంగత పండగ సాయన్న పౌరుషానికి ప్రతిరూపంగా నిలుస్తుందగా, ఆయన స్ఫూర్తితో ముదిరాజ్ యువత ముందుకు సాగి హక్కులు సాధించుకోవాలని హైకోర్టు న్యాయవాది, టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పష్టం చేశారు. గురువారం గజ్వేల్ లో పండగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించగా, ఆయన అద్భుత విగ్రహ ఏర్పాటుకు నడుం బిగించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా భూస్వాముల కుట్రలకు పండగ సాయన్న బలి కాగా, ఇప్పటికైనా ఆయన సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తుండడం శుభ పరిణామమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవంగా నిలిచిన పండగ సాయన్నను రాబిన్ హుడ్ గా నిలుస్తుం



దగా, పెద్దల దగ్గర ఉన్న సంపదను పేదలకు పంచిపెట్టి చరిత్రలో చిరస్థాయిగా పండగ సాయన్న నిలిచినట్లు గుర్తు చేశారు. అయితే పెత్తందారులు, నిజాం పాలకులు, దొరలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి ఊపిరి పోసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ, ప్రజ్ఞాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి పూదరి రాజలింగం, డాక్టర్ ఎల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/కొండపాక : పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జీర్ల రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు, యువకులు వెలికట్ట క్రాస్ రోడ్ నుంచి దుద్దెడ వరకు రాజీవ్ రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ధర్మ ముదిరాజ్, సిద్దిపేట మాజీ వైస్ చైర్మన్ కనకరాజు ముదిరాజ్, నాయకులు సున్నం భాస్కర్, నర్సింలు, సుదర్శన్, శ్రీనివాస్, అశోక్, నాగరాజు, పిట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఆత్మ బంధువు పండుగ సాయన్న

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్: బహుజనుల ఆత్మ బంధువు తెలంగాణ రాబిన్ హుడ్ గా పేరు గాంచిన ముదిరాజ్ బిడ్డ పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని లింగారెడ్డిపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బొంద్ల రామస్వామి అన్నారు. అన్ని ప్రభుత్వాలు ముదిరాజ్ లను ఓటు బ్యాంకు గా వాడుకుంటున్నాయి తప్ప ముదిరాజ్‌ల అభివృద్ధికి ఏమి చేయలేదన్నారు. గురువారం సిద్దిపేట మున్సిపల్ పరిధి 1వార్డు లింగారెడ్డి పల్లి లో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ గుడి నుండి ముదిరాజ్ సంఘం నాయకులు భారి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం జండా ఆవిష్కరించి పండగ సాయన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం



నాయకులు బాలయ్య, రమేష్, శ్రీనివాస్ లతో కలిసి రామస్వామి మాట్లాడారు. తెలంగాణలో ఎక్కువ జనాభా కలిగిన ముదిరాజులు ఐక్యంగా పోరాడి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. బిసి డిలో కొనసాగుతున్న ముదిరాజ్ కులాన్ని బిసి ఎలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘల అధ్యక్షులు తాటికొండ కనకయ్య, బాలయ్య, లక్ష్మయ్య క్యాషియర్ రాజేల్లయ్య, సెక్రటరీ రాజు, ఉప్పలయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు...



ప్రజాపక్షం/సిద్దిపేట జిల్లా ప్రతినిధిః పండగ సాయన్న బహుజనులపై ఏ వర్గాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయో గుర్తించి దాన్ని ఎదుర్కొనటానికి జ్ఞానమనే చదువు కావాలని, బహుజన వర్గాలు చదువుకోవాలన్న సందేశం ఇచ్చాడని సిద్దిపేట జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండగ సాయన్న జయంతి వేడుకలకు జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పండుగ సాయన్న భారత స్వతంత్రోద్యమ (1900) కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు,ఉద్యమాలు ఒక సమాంతర చరిత్ర,పండుగ సాయన్న ఈ సమాంతర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవాడు. ఆధిపత్య శక్తులపై యుద్ధం చేసే క్రమంలో ప్రజలను చైతన్యపరచాడు. బహుజనులపై ఏ వర్గాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయో గుర్తించి దాన్ని ఎదుర్కొనటానికి జ్ఞానమనే చదువు కావాలని చదువుకున్నాడు. బహుజన వర్గాలు చదువుకోవాలన్న సందేశం ఇచ్చాడనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిబిసిడిఓ సయ్యద్ రఫిక్, డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య, ఎఒ రాజ్ కుమార్, ముదిరాజ్ ప్రముఖులు జంగిటి కనకరాజు, యమధర్మ, తోట్ల పరుశురాములు, గాద్దర్ల సతీష్, రామకృష్ణ, తుపాకుల బాలరంగం, చింతమడక రాజన్న శ్రీహరి, గుర్రాల శ్రీహరి, సత్యనారాయణ,కొంతం శ్రవణ్, గాద్దర్ల నాగరాజు, ముదిరాజ్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# దుద్దెడ టోల్‌గేట్ వద్ద రద్దీ

ప్రజాపక్షం/కొండపాక : బతుకమ్మ దసరా పండుగలు ముగియడంతో పట్నం నుంచి పల్లెలకు వచ్చిన వారంతా పట్నం బాట పట్టారు. సెలవులన్నీ ముగియడంతో హైదరాబాద్ వైపు వెళ్తుండడంతో వాహనాల సంఖ్య పెరిగింది. రాజీవ్ రహదారిపై దుద్దెడ శివారులో ఉన్న టోల్గేట్ వద్ద వాహనాల రద్దీ పెరిగింది. గురువారం ఉదయం నుంచి వాహనాలు హైదరాబాద్ వైపు భారీ సంఖ్యలో వెళుతుండడంతో హైదరాబాద్ వైపు వెళ్లే రెండు కౌంటర్లను ఎక్కువగా తెరిచారు. అయినప్పటికీ



వాహనాల సంఖ్య తగ్గలేదు. సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి.

# పద్మా దేవేందర్‌రెడ్డిని కలిసిన బిఆర్ఎస్ నేతలు



ప్రజాపక్షం/మెదక్ : దసరా పండుగను పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం పండుగ సందడి నెలకొంది. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల. శశిధర్‌రెడ్డిని జిల్లాలోని వివిధ పట్టణాలకు, గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి చేరుకోవడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి, పట్లోళ్ల శశిధర్‌రెడ్డిలను నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మెదక్ జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తల కోసం పద్మా దేవేందర్‌రెడ్డి భోజన ఏర్పాట్లు చేశారు. దసరా పండుగ నేపథ్యంలో పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల రాకపోకలతో సందడి నెలకొనగా, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, జుబేర్,దీపక్, నాయకులు లింగారెడ్డి, ప్రభు రెడ్డి, కిషన్, సాయిలు, ఆంజనేయులు తో పాటు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు

ప్రజాపక్షం/పాపన్నపేట : తెలంగాణ వీరుడు పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను



పాపన్నపేట మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ముశెట్టి కిష్టయ్య మాట్లాడుతూ, పండుగ సాయన్న పేద ప్రజల పక్షాన నిలిచి, అన్యాయాలను ఎదిరించిన ధైర్యశాలి అని కొనియాడారు. దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, పేదల కోసం నిలబడిన ప్రజా వీరుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి, త్యాగనిరతి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ముదిరాజ్ సామాజిక వర్గ అభివృద్ధి, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు బుడిమె సత్యనారాయణ, యువజన అధ్యక్షుడు కిరణ్, ముదిరాజ్ నాయకులు సాయిలు, బొక్కల బాగయ్య, ఏసు వెంకటేశం, ఆంజనేయులు, విఠల్, మల్లేశం, లక్ష్మణ్ తదితర సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా అమ్మవారి శోభాయాత్ర

ప్రజాపక్షం/కొండపాక : కొండపాక మండలం మర్పడగ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో శరన్నవరాత్రులు ముగియడంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక రథంపై ఉత్సవ విగ్రహాలను పెట్టి గ్రామంలోని పురవీధుల గుండా భజనలతో నృత్యాలతో కోలాటాలతో అట్టహాసంగా ఊరేగింపుగా శోభ యాత్ర సాగింది. మంగళ హారతులతో రథయాత్రకు స్వాగతం పలికి గ్రామస్తులు పూజలు చేశారు. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ శోభాయాత్రను ప్రారంభించారు. కమిటీ సభ్యులు దేవిక సమితి సభ్యులు, పాఠశాల విద్యార్థుల నృత్యాలతో శోభాయాత్ర సాగింది.

# అక్రమ ఇసుక రవాణ ట్రాక్టర్ పట్టివేత..

ప్రజాపక్షం/బెజ్జంకి: మండల పరిధిలోని మోయతుమ్మెద వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత వ్యక్తి గాగిళ్లపూర్ గ్రామానికి చెందిన బామండ్ల లక్ష్మణ్ అలియాస్ లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.తిరుపతి తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అవగాహన

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కొండపాక మండలంలో రైతు నేస్తం కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం



**ప్రజాపక్షం/కొండపాక :** రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలు మార్కెటింగ్ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొండపాక దుద్దెడ రైతు వేదికల్లో గురువారం రైతు నేస్తం ప్రత్యేక కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని మాట్లాడారు. రైతు నేస్తం ద్వారా రైతులకు పలు సూచనలు అందుతాయి అన్నారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ద్వారా రైతులకు ఎల్‌నినో ప్రభావం, వాతావరణ వర్షపాత పరిస్థితులు, పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్లు, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, సంబంధిత శాఖల అధికారులు పలు సూచనలు చేశారు. రైతులు ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని, నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, జిల్లా మార్కెటింగ్ అధికారి, డి.ప్రకాష్, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి మహిపాల్ సింగ్, కొండపాక మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ, ఉద్యాన శాఖ అధికారి కౌసల్య, వివిధ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు

## మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన లాడే బాలు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** దసరా పండుగ సందర్భంగా సంగారెడ్డిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తో కలిసి 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ లాడే బాలు ,మాజీ మంత్రి సీనియర్ బీఆర్ఎస్ నాయకులు హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు , కార్యకర్తలు, కూడా పాల్గొన్నారు. పండుగ సందర్భంగా జరిగిన ఈ మర్యాద పూర్వక భేటీ నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది .

## పండుగ సాయన్న ధైర్యసాహసాలు అందరికి స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** అణగారిన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఇన్‌చార్జ్ డీఆర్డీఓ ఉమా హారతి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగసాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాటి భూస్వాములు ,దొరల ఆరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న విరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు, తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికి పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్, అంజయ్య, ముదిరాజ్, సంఘం జిల్లా అద్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ , యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## టిఎన్‌జిఒ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ సంఘం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సెంట్రల్ యూనియన్ మహిళా ఉపాధ్యక్షురాలు నిర్మల రాజకుమారి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ నూతన జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ జావిద్ అలీ, జిల్లా కార్యదర్శిగా వేల్పూరి రవి అసోసియేట్ అధ్యక్షులుగా వెంకటరెడ్డి ,శ్రీనివాస్, కోశాధికారిగా కసిని శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్‌గా బాస్కర్, ఉపాధ్యక్షులుగా కృష్ణ నాగేశ్వరరావు, శ్రీకాంత్, విజయలక్ష్మి, జాయింట్ సెక్రెటరీలుగా షకీల్, నరసింహారెడ్డి, మోహనప్ప, సుధామణి ఆఫీస్ సెక్రటరీగా సాయికుమార్ స్పోర్ట్స్ సెక్రటరీగా వెంకటేషం, రవికుమార్, మాణిక్యం, ఈసీ మెంబర్లుగా విజయ్ కుమార్, మురళీధర్, లక్ష్మి, పుష్పలత, బషీర్, సురేఖ, వినయ్, బాలామణి, శ్యాంసుందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ అలీ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం హక్కుల పరిరక్షణ సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి హక్కుల సంక్షేమం సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. ఏకగ్రీవ ఎన్నిక ద్వారా సంఘం నాయకత్వంపై ఉద్యోగుల ఉంచిన విశ్వాసం స్పష్టమైందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుండి నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్ల బాధ్యులు ప్రమోద కుమార్, యాదవ్ రెడ్డి, వెంకట్, మిస్కిన్, దత్తు, నర్సింలు, దుర్గయ్య, పాల్గొన్నారు.

## హరీష్‌రావుకు దసర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావును దసర సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు జమ్మి ఆకులు అందించి దసర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆప్యాయంగా పలకరించుకుని ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు. దసరా పండగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు ,ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి, నియోజకవర్గ నాయకులు ,ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు, కార్యకర్తలు ఉన్నారు.

## చట్ట సభలో ముదిరాజులకు ప్రాదాన్యత కల్పించాలి

**ప్రజాపక్షం/హత్నూర :** చట్టసభలో ముదిరాజులకు ప్రాధాన్యత కల్పించాలని నీలం ముదిరాజ్ అన్నారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్ ఎస్ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న 174 జయంతి ఉత్సవాల్లో నీలం ముదిరాజ్ పాల్గొని ఆయనచిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభలో ముదిరాజులకు ప్రాధాన్యత కల్పించాలని నీలం ముదిరాజ్ అన్నారు. రానున్న రోజుల్లో ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే ల సంఖ్య పెంచేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. ముదిరాజులను బి.సి.డి నుండి ఏ లోకి మార్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కలిసి మాట్లాడినట్లు సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు ఆయన స్పష్టం చేశారు. రాజకీయంగా ఏదగాలంటే కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలతో కలసి పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అద్యక్షుడు తలారి రాజేందర్, ఉపాధ్యక్షుడు అంబటి అర్జున్ ముదిరాజ్, నాయకులు గున్నాల నర్సింలు, కొన్యాల సతీష్, దూడి పోచయ్య, యాదగిరి, కొన్యాల సర్పంచ్ సుజాత సత్యం, కె. కృష్ణ, గోవింద్ రాజ్, పల్లి సర్పంచ్, రాజు కాసాల సర్పంచ్ వెంకటేష్, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలలో ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి



**ప్రజాపక్షం/చేర్యాల :** అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న అని, కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎంఎల్ఏ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడి, ప్రజలకు అండగానిలిచిన వీరుడు పండుగ సాయన్న అని మాజీ ఎంఎల్ఏ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. పండుగ సాయన్న ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన మండల నూతన కమిటీ ఎన్నిక..

### -టీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా ఎరవెల్లి మహేందర్ నియామకం..

**ప్రజాపక్షం/బెజ్జంకి :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మండల నూతన కమిటీని పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.మండలాధ్యక్షుడిగా మండల పరిధిలోని ఎరవెల్లివాడ గ్రామానికి చెందిన ఎరవెల్లి మహేందర్‌ను నియమించినట్లు శుక్రవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శిగా పొర్ల రమేష్,ఆర్గనైజింగ్ సెక్రటరీగా సొల్లు ఆంజనేయులు, కోశాధికారిగా కొంపెల్లి మధు, సంయుక్త కార్యదర్శులుగా అంజుమల్ల బాబు, కుంచం రాజు, కమిటీ సభ్యులుగా రావుల రాకేష్, పరకాల శ్రీధర్, రైతు, యువజన, మహిళా విభాగంల్లో అంజుమల్ల దేవరాజు, రాగతి రవి, సొల్లు తారలను నియమించినట్లు తెలిపారు. ఈ సంధర్భంగా నూతనంగా ఎన్నికైనా మహేందర్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తనపై నమ్మకంతో అవకాశం ఇచ్చి ఎన్నికకు సహకరించిన మానకొండూర్ ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్యకు, సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ చల్లమల్లారెడ్డికి, కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజుకు, గుంజపడుగు హరిప్రసాద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ఒంటికాలు పై నిలబడి నిరసన



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్ హెచ్ ఎం పరిధిలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల ఒంటికాలు పై నిలబడి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగుల ఒంటికాలు పై నిలబడి నిరసన అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో సంవత్సరాలుగా ఆరోగ్య శాఖలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా ఉద్యోగుల ప్రధాన డిమాండ్లైన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం అమలు, ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందడం లేదు ఎన్ హెచ్ ఎం జేఏసీ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా అధ్యక్షులు బడితెల రమేష్, ప్రధాన కార్యదర్శి మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ఉపాధ్యక్షులు డా॥ రఘురాం, అడ్వైజర్స్ ప్రభాకర్ శ్రీనివాస్, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డా॥ జగదీష్, మీడియా ఇంచార్జ్ రాజు, డా॥ విజయ్, డా॥ బాలకృష్ణ, ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, చిత్ర, పార్వతి, స్టాఫ్ నర్స్, ఫార్మసీ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొమురం భీమ్ జయంతి



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లా కేంద్ర గ్రంథాలయం సంగారెడ్డి లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు జి అంజయ్య, కార్యదర్శి యం మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో కొమురం భీమ్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. జల్,జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన విప్లవ వీరుడు గిరిజన ఆత్మ గౌరవానికి ప్రతీక కొమురం భీమ్ అని వక్తలు కొనియాడారు. ఆయన సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ,పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అడెల్లి పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో ప్రైవేటు కమిటీ అక్రమాలు

ప్రజాపక్షం/నిర్మల్/సారంగాపూర్ : అడెల్లి పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మ వారి పేరున ప్రైవేటు వ్యక్తుల కమిటీ భారీగా విరాళాలు సేకరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆలయ ప్రారంభోత్సవంతో పాటు దానికి సంబంధించిన అన్ని ఘట్టాలను దేవదాయ శాఖనే అధికారికంగా నిర్వహిస్తోందని చెప్పుకున్నప్పటికీ, ఈ ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం ఏంటని భక్తులు, స్థానికులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. దేవదాయ శాఖ (ఎండోమెంట్) పరిధిలో ఆలయం అధికారికంగా కొనసాగుతున్నప్పటికీ, అక్కడ ప్రైవేటు వ్యక్తుల కమిటీలను ఏర్పాటు చేయడం పట్ల ప్రజలనుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈవో భూమయ్య వివాదాస్పద వివరణ నిధుల దుర్వినియోగం! ఈ విషయంపై అడెల్లి పోచమ్మ ఆలయ ఈవో భూమయ్యను వివరణ కోరగా.. తాము ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ప్రైవేట్ కమిటీనే సొంతంగా ఖర్చు పెట్టుకుంటామని అన్నారని తెలపడం గమనార్హం. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే దేవాలయంలో ప్రైవేటు వ్యక్తులు ఏవిధంగా నిధులు సేకరిస్తారు, బాధ్యత లేని రీతిలో ఈవో ఇలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని భక్తులు మండిపడుతున్నారు. అమ్మవారి ఉత్సవాల పేరుతో భక్తుల నుంచి సేకరించిన నిధులలో కేవలం సగం మాత్రమే ఖర్చు చూపి, మిగతా సొమ్మును కమిటీ సభ్యులు తమ సొంత అవసరాలకు వాడుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జమాఖర్చులకు సంబంధించి సంవత్సర కాలం గడుస్తున్నప్పటికీ, మిగిలిన సొమ్మును ఆలయ ఖాతాకు గానీ, అధికారులకు గానీ అందించకపోవడం వారి అక్రమాలకు బలం చేకూరుస్తోంది. భక్తుల నమ్మకాన్ని, భక్తిని ఆసరాగా చేసుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లెక్కల్లేని నిధులు ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్ సొమ్ములా మార్చుతున్న వైనం? అడెల్లి పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం కమిటీని ఏర్పాటు చేశామంటున్న నిర్వాహకులు, అసలు ఇప్పటివరకు ఎన్ని నిధులు సేకరించారు? ఆ లెక్కలను ఎక్కడైనా బహిరంగపరిచారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్ని వచ్చాయి, ఎంత ఖర్చు చేశారనే దానిపై స్పష్టత లేకపోతే ఎలా అని నిలదీస్తున్నారు. ప్రభుత్వ సొమ్మును, భక్తులు సమర్పించిన కానుకలను ప్రైవేట్ సొమ్ములా మలుచుకుంటూ కొందరు వ్యక్తులు చేస్తున్న దందాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రైవేట్ సొమ్ములా వ్యవహరిస్తూ లెక్కలు చూపకపోవడం వెనుక పెద్ద తతంగమే నడుస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. విలేకరిపై దౌర్జన్యానికి ప్రయత్నం! ఈ అక్రమాలపై నిజాన్ని నిర్భయంగా సమాజానికి తెలియజేసేందుకు ప్రయత్నించిన విలేకరిపై సదరు ప్రైవేటు కమిటీ సభ్యులు దౌర్జన్యానికి దిగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వార్తరాశారనే కక్షతో విలేకరిని బెదిరించడమే కాకుండా, ఆయనపై భౌతిక దాడికి ప్రయత్నించడం పట్ల పాత్రికేయ సంఘాలు, స్థానికులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇప్పటికైనా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి ఈ నిధుల సేకరణపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఆలయ సొమ్మును రక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు



ప్రజాపక్షం/తానూర్ : మండల కేంద్రమైన తానూర్ లో ప్రజా యోధుడు,తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సాయన్న చిత్రపటానికి ముదిరాజ్ సంఘం నాయకులు,ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా మెరుగోనిపల్లె గ్రామంలో జన్మించిన సాయన్న,నిజాం నిరంకుశ పాలనకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి,పేదల ఆకలి తీర్చిన మహనీయుడని కొనియాడారు.నిజాం ధాన్యాగారాల నుంచి ధాన్యాన్ని తీసుకొచ్చి పేదలకు పంచి పెట్టిన త్యాగమూర్తి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాయినాథ్,ఉప అధ్యక్షుడు మల్లేష్,ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి,మాజీ సర్పంచ్ రాములు,ధర్మోడ్ సుభాష్,గణేష్,ఎల్లప్ప,ముదిరాజ్ సంఘం, నాయకులు,కుల పెద్దలు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బహుజన సంక్షేమ పోరాట వీరుడు పండుగ సాయన్న

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం బహుజన సంక్షేమ పోరాట వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకలలో జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు.ముందుగా అధికారులు,ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,బహుజనుల అణిచివేతపై ఆనాటి కాలంలో దొరలు,భూస్వాములు,నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న గొప్ప పోరాటాలు చేశారని గుర్తు చేశారు.ఆయనను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రభుత్వం తొలిసారిగా పండుగ సాయన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు.ఇలాంటి మహనీయుల జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనానో ఉందని తెలిపారు.పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ,నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లలో,ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ రాబిన్ హుడ్ గా సుపరిచితుడైన సాయన్న ప్రజలను దోచుకుంటున్న దొరలు,దేశముఖ్ లు,అధికారులు,సంపన్నుల ఆస్తులను తీసుకొని పేదలకు పంచిపెట్టాడని తెలిపారు.నాటి నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి,వారిని ఎదిరించి బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నించాడని వివరించారు.పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ జయంతి వేడుకలలో బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్,ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి,కార్మిక శాఖ అధికారి రాజలింగం,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.



# పశువుల సంత ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ప్రజాపక్షం/భైంసా : భైంసా పట్టణంలోని పశువుల సంతలో రూ. 31 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు.అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద రావు పటేల్ ఆధ్వర్యంలోని పాలకవర్గం పదవీకాలం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు అందించిన సేవలను, మార్కెట్ కమిటీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. రైతుల సంక్షేమం కోసం చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ చేసిన సేవలను అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ సిందే ఆనంద రావు పటేల్‌ను ఘనంగా సన్మానించారు.అలాగే పాలకవర్గ పదవీకాలం ముగింపు సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,అక్కడ ఉన్న అధికారులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనందరావు పటేల్ ,డైరెక్టర్లు,మార్కెట్ కమిటీ ప్రతినిధులు,అధికారులు, ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన దుర్గామాత నిమజ్జనోత్సవాలు

## ఎస్పి జానకి షర్మిల



ప్రజాపక్షం/భైంసా : భైంసా పట్టణంలో దుర్గామాత నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి.భక్తులు,ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ 300 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.జిల్లా ఎస్పీ డా. జి.జానకి షర్మిల స్వయంగా భైంసాలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని, శోభాయాత్ర మార్గాలు, ప్రధాన కూడళ్లు,రద్దీ ప్రాంతాలు,నిమజ్జన ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పర్యవేక్షించారు.భైంసా పట్టణాన్ని నాలుగు సెక్టర్లుగా విభజించి పంజేసా మసీదు, పురాణ బజార్,బ్రాహ్మణ గల్లి, బట్టి గల్లి, కిసాన్ గల్లి, పిపిరి కాలనీ,కుబేర రోడ్డు,పంజేసా చౌక్ తదితర ప్రాంతాల్లో పోలీసులను నియమించారు.ట్రాఫిక్ నియంత్రణ, పుషింగ్ పార్టీలు,రూఫ్‌టాప్ బందోబస్తు, బైక్ పెట్రోలింగ్, స్టాటిక్ బందోబస్తు వంటి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.భైంసాతో పాటు ముధోల్ పట్టణంలోనూ జిల్లా ఎస్పీ స్వయంగా పర్యటించి దుర్గామాత నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి, భద్రతా చర్యలను పర్యవేక్షించారు. రెండు పట్టణాల్లోనూ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.బందోబస్తులో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన భక్తులు, మండపాల నిర్వాహకులు, ప్రజలకు నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ కృతజ్ఞతలు తెలియజేసింది.ఈ కార్యక్రమాల్లో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్,IPS, పోలీస్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా పెద్ద భీమన్న స్వామి వారి జాతర మహోత్సవాలు!

ప్రజాపక్షం/మామడ : నిర్మల్ జిల్లా మామడ మండలం పోతారం గ్రామంలో ఆదివాసి నాయక పోడ్ కుల దేవుడైన శ్రీశ్రీశ్రీ పెద్ద భీమన్న స్వామి జాతర మహోత్సవాలు సంప్రదాయబద్ధంగా,వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ ఉత్సవాలు బుధవారం రాత్రి నుండి అక్టోబర్ 26 సోమవారం వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి.బుధవారం సాయంత్రం స్వామి వారిని గుడి నుండి మరం (ఇంటి) వద్దకు తీసుకురావడంతో జాతర వేడుకలు మొదలయ్యాయి.గురువారం నుండి శనివారం (అక్టోబర్ 24) వరకు చుట్టుపక్కల పరిసర గ్రామాల్లో ఊరు ఊరూ తిరుగుతూ స్వామి వారి ఊరేగింపు మహోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటల నుండి స్వామి వారి ఊరేగింపు కొనసాగి,సాయంత్రం 6 గంటల నుండి పవిత్ర గంగ స్నానం (గంగ నీళ్లకు వెళ్లడం) కార్యక్రమం జరుగుతుంది.అనంతరం రాత్రి 12:30 గంటలకు గుడి వద్దకు గజాలు చేరుకుంటాయి. ముగింపు రోజున అంటే అక్టోబర్ 26 సోమవారం ఉదయం 7 నుండి 8 గంటల వరకు బండారు బాసంతం రంగుల వేడుక ఘనంగా జరగనుంది. ఈ జాతర మహోత్సవంలో భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకోవాలని ఆదివాసి నాయక పోడ్ సేవా సంఘం,పోతారం సభ్యులు ఆహ్వానిస్తున్నారు.

# నిర్మల్ జిల్లా కేంద్రంలో కొమురం భీమ్ విగ్రహాల వద్ద తాగుబోతుల అల్లరి

## ఆదివాసి నాయకుల తీవ్ర ఆవేదన!

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కొమరం భీమ్ 125వ జయంతిని పురస్కరించుకొని గురువారం రోజు నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం మొదట మరియు ఫారెస్ట్ కార్యాలయం ఎదురుగా ఉన్న కొమరం భీమ్ విగ్రహాలకు ఆదివాసి నాయక పోడు సేవా సంఘం,తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంక గారి భూమయ్య,జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్ మాట్లాడుతూ కొమరం భీమ్ జయంతి మరియు వర్ధంతి రోజులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి సాధారణ సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాల పరిసర ప్రాంతాల్లో కనీసం మొక్కలకు నీళ్లు పోసే పరిస్థితి కూడా లేదని,ఈ ప్రాంతాలను వైన్స్, తాగుబోతులకు అడ్డగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తాగిన సీసాలను అక్కడే పడేస్తూ విగ్రహ పరిసరాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుస్తున్నారని మండిపడ్డారు.ఇప్పటికైనా నిర్మల్ జిల్లా మున్సిపల్ అధికారులు స్పందించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొమరం భీమ్ స్ఫూర్తితో ఆదివాసులు 5వ షెడ్యూల్డ్ ఏరియా హక్కుల అమలు కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మైదాన ప్రాంతంలో ఆదివాసి తెగలకు సరైన గుర్తింపు ఇవ్వకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.నిర్మల్ జిల్లాలో వలసవాదులకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వడాన్ని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు.నిజాం నవాబుల పాలనకు వ్యతిరేకంగా జల్, జంగిల్, జమీన్ నినాదంతో భూమి, అడవి, నీరుపై ఆదివాసులకు హక్కులు కావాలని పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ అని కొనియాడారు. నిర్మల్ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి ఆదివాసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.అలాగే ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు రక్షణ కల్పించి, వెంటనే హక్కు పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయక పోడు ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి శివ శంకర్,నాయక పోడు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సవీన్,రమేష్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి గోవర్ధన్,జిల్లా బీజేపీ నాయకులు నర్సారెడ్డి,నైతం భీమ్ రావు,సూర్య భాను,ఉయిక భీమ్‌రావు, రాములు, పాల్గొన్నారు.

